క్లుప్తంగా

రేపు మధ్యాహ్నం నుంచి ఆలయాలు మూసివేత

పాత గుంటూరు: చంద్రగ్రహణం సందర్భంగా కొత్తపేటలోని ఆంజనేయ స్వామి దేవస్థానం, జగన్నాథ స్వామి దేవస్థానం, లాలాపేటలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానాలు 28న మధ్యాహ్నం 12.30 నిమిషాల నుంచి మూసి వేయనున్నట్లు ఈఓ జొన్నకూటి సూర్యప్రకాశ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ శుద్ధి సంప్రోక్షణ కార్యక్రమాల అనంతరం 29న సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వార్ల పునఃదర్శనం భక్తులకు కల్పించనున్నట్లు తెలిపారు.

మణికుమార్‌కు ఆంధ్ర వర్సిటీ పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ రక్షణ, వైద్య రంగాలకు ఉపయోగపడే పరిశోధన చేసిన గుంటూరు నగరానికి చెందిన జోగి మణికుమార్‌కు ఆంధ్ర విశ్వ విద్యాలయం పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. ఆంధ్ర వర్సిటీ ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇంప్లిమెంటేషన్ ఆఫ్ నేచర్ ఇన్‌స్పైర్డ్ ఆప్టిమైజేషన్ ఆల్గారిథమ్స్ టు ఎంఆర్ఐ ఇమేజ్ ఎన్‌హాన్స్‌మెంట్ అనే అంశంపై ఆచార్య వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు జోగి మణికుమార్ వర్సిటీ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తిని తన స్నేహితుడు హత్య చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటరమణ కాలనీకి చెందిన బి.ఓంకారాచారి (20), సీతమ్మకాలనీకి చెందిన వెంకటేశ్వర్లు ఇరువురు స్నేహితులు. ఇరువురు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇరువురు కలిసి బుధవారం రాత్రి శ్యామలానగర్ రైల్వేగేటు సమీపంలో సాయికృష్ణ బార్‌కు వెళ్లి అతిగా మద్యం సేవించారు. బార్ బయటకు వచ్చి ఇరువురు ఘర్షణ పడ్డారు. వెంకటేశ్వర్లు తన చేతిలోని మద్యం బాటిల్‌తో ఓంకారాచారిని పొడిచి పారిపోయాడు. స్థానికులు బాధితుడిని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఓంకారాచారి మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ పర్యటనకు నగర కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 27 నుంచి నవంబర్ 5వ తేదీవరకు స్వీడన్, ఆస్ట్రేలియా దేశాల్లో యూనిడో నిర్వహించనున్న అంతర్జాతీయ వైనా ఎనర్జీ అండ్ క్లైమేట్ ఫోరమ్ సదస్సులో కమిషనర్ పాల్గొననున్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ఇతర పలు అంశాలపై విదేశీ పర్యటనకు వెళ్లేందుకుగాను గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీ కార్గో ఆదాయాన్ని పెంచాలి



పొన్నూరు: ఆర్టీసీ ఉద్యోగులు సమష్టిగా పని చేసి కార్గో ఆదాయాన్ని పెంచాలని పొన్నూరు డిపో మేనేజర్ అజిత కుమారి పేర్కొన్నారు. గురువారం కార్గో పార్సిల్, కొరియర్ సర్వీసుల డోర్ డెలివరీ మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా డిపో ప్రాంగణంలో ఉద్యోగులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి కనీసం నాలుగు డోర్ డెలివరీలు చేయించే విధంగా ప్రయత్నించాలని కోరారు. డోర్ డెలివరీపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్గో, గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం



పెదకాకాని: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా నంబూరు జయభారతరెడ్డి నగర్‌లో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంబూరు గ్రామంలో బుధవారం రాత్రి కనకదుర్గమ్మకు మేళ తాళాలు, బాణ సంచా భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు భీమిరెడ్డి వేణుగోపాలరెడ్డి, కూసం విష్ణు, తిరుమలరెడ్డి, జొన్నల కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో గీతా పోటీలు



కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా ధార్మిక మండలి చైర్మన్ మురళీమోహన్

పాత గుంటూరు: పట్టాభిపురంలోని జిల్లా ధార్మిక మండలి చైర్మన్ తాడిశెట్టి మురళీమోహన్ కార్యాలయంలో జిల్లా ధార్మిక మండలి సభ్యుల సమావేశం నిర్వహించారు. గీతా జయంతిని పురస్కరించుకొని టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో ఉమ్మడిజిల్లాలో నిర్వహించనున్న గీతా పోటీలకు సంబంధించిన కరపత్రాలను మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 17న గుంటూరు టీటీడీ కల్యాణ మండపంలో, 23న నరసరావుపేట గీతా మందిరంలో, 24న బాపట్ల శివాలయంలో గీతా పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు 6,7,8,9 తరగతుల విద్యార్థులకు భగవద్గీత 3 అధ్యాయంలోని 1 నుంచి 30 శ్లోకాలు, పెద్దలకు 700 శ్లోకాలకు పోటీలు ఉంటాయని చెప్పారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించాలని కోరారు. ధార్మిక మండలి సభ్యులు పి.సుబ్బారావు, టి.శివయ్య, సీహెచ్ శ్రీనివాసరావు, కె.ఆదినారాయణ రెడ్డి, ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త అమ్ముడు పాల్గొన్నారు. వివరాలకు 9989023329 నెంబర్‌లో సంప్రదించాలని అమ్ముడు కోరారు.

సమష్టిగా మండలాభివృద్ధికి కృషి చేద్దాం

- జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ పులగం దివ్య
- గుంటూరు రూరల్ మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుబ్బారావు, ఎంపీపీ దివ్య

గుంటూరు రూరల్: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా మండలాభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ పులగం దివ్య అన్నారు. గురువారం నగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ మండల పరిధిలో రైతులకు అవసరమైన డొంకలు, రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. తాగునీటి వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని కోరారు. ఎంపీపీ దివ్య మాట్లాడుతూ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జగనన్న కాలనీలలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను సచివాలయం కార్యదర్శులు గుర్తించి, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీఓ ఆదినారాయణ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ 64.06 లక్షల మిగులు నిధులతో అంచనా బడ్జెట్‌ను, వివిధ గ్రామాల్లో రూ.42 లక్షల అంచనాలతో ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పనులను సమావేశంలో ఆమోదించటం జరిగిందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఓబులునాయుడు పాలెంలో రూ.3లక్షలతో హెచ్‌డబ్ల్యూసీ భవన నిర్మాణం, రూ.3 లక్షలతో ఆర్‌బీకే, హెచ్‌డబ్ల్యూసీ భవనాల మెరక అభివృద్ధి కార్యక్రమాలకు, జొన్నలగడ్డ గ్రామంలో రూ.3 లక్షలతో బీఎంసీయూ భవన నిర్మాణం, రూ.14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.3 లక్షలతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరం అభివృద్ధి పనులకు, రూ.75 వేలతో ప్రహరీ నిర్మాణం, రూ.5 లక్షలతో మల్లవరం గ్రామంలో సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు, రూ.4 లక్షలతో గొర్లవారిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలను సమావేశంలో ప్రతిపాదించి, ఆమోదం తెలపటం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, దర్శి సుజాత, ఎంపీటీసీలు భూలక్ష్మి, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సుశిక్షితులుగా ఎన్‌సీసీ విద్యార్థులు



శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

గుంటూరు రూరల్: దేశ సేవలో మేము సైతం అంటూ ఎన్‌సీసీ విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను చూపుతున్నారని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ఐదు రోజులుగా చౌడవరం గ్రామంలోని కళాశాలలో జరుగుతున్న 10వ ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఇప్పటి వరకు మాక్ డ్రిల్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్, కవాతు, లీడర్‌షిప్, ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఒత్తిడిని అధిగమించేందుకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. క్యాంపు కమాండెంట్ కల్నల్ నీరజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని నింపేందుకు ఎన్‌సీసీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు సాంస్కృతిక, దేశభక్తి గీతాల ఆలాపనలో శిక్షణనివ్వటం జరిగిందన్నారు. తుపాను, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తు పరిణామాలు సంభవించినప్పుడు ధైర్య సాహసాలతో ప్రజలను కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలను, ముందస్తు జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన వివిధ రకాల శిక్షణల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 80 మంది విద్యార్థినులను గుంటూరు గ్రూప్ కమాండెంట్ కల్నల్ చంద్రశేఖర్ నేతృత్వంలో ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వారిని హైదరాబాద్‌లో నిర్వహించే ఇంటర్ గ్రూప్ కాంపిటేషన్‌లో పాల్గొనేందుకు పంపించామని, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించి అందుకు తగిన శిక్షణ అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ రెజిత్ ముకుందన్, క్యాంపు ఎస్ఎం సుబేదార్ పాణ్యం రఫీ, 10–ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ సూపరింటెండెంట్ రాజశేఖర్‌బాబు, క్యాంపు క్యూఎం జేసీఓ, ఎన్‌సీఓలు, ఎన్‌టీఎస్‌లు, క్యాంపు ట్రైనింగ్ జేసీఓ నాయబ్ సుబేదార్ షేక్ ఖాజావలి, కళాశాల ఎన్‌సీసీ బాలుర విభాగ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ తారా చంద్, తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు



రైతులతో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో పంటలను ప్రకృతి వ్యవసాయ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ప్రకృతి వ్యవసాయంపై అభిప్రాయాలను అడిగారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సారవంతమైన, ఆరోగ్యమైన నేల, నాణ్యతతో కూడిన పంట దిగుబడి లభిస్తుందని వివరించారు. రైతు భరోసా కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులతో ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే మార్పులను వివరించారు. నీతి ఆయోగ్ టీమ్ అడిషనల్ సెక్రటరీ రాధా, అడ్వయిజర్ పార్థసారథి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డీపీఎం రాజకుమారి, ఆర్‌పీసీ వెంకటరావు, సత్యనారాయణ, వ్యవసాయ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాతీయ త్రోబాల్ పోటీల్లో బహుమతులు



మహిళలు, పురుషుల జట్ల క్రీడాకారులు

తెనాలి: జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు రన్నర్స్ స్థానాన్ని గెలుచుకోగా, పురుషుల జట్టు తృతీయ బహుమతిని దక్కించుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని బిజినూర్‌లో ఈనెల 22–24 తేదీల్లో జాతీయ త్రోబాల్ పోటీలు జరిగాయి. రన్నర్స్‌గా నిలిచిన మహిళల జట్టును, తృతీయ బహుమతిని గెలిచిన పురుషుల జట్టు క్రీడాకారులను రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభుకుమార్, జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రావిపాటి వీర నారాయణరావు, సంఘ సభ్యులు బాలాజీనాయక్, నల్లూరి వెంకటేశ్వరరావు అభినందించారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి

తాడికొండ: ప్రమాదవశాత్తు వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంతేరు గ్రామానికి చెందిన బుల్లా కోటేశ్వరరావు(40) చిన్నతనం నుంచి మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల కాలంలో ఈ సమస్య అధికమైంది, గురువారం బహిర్భూమికి వెళ్లగా చెరువు ఒడ్డున ఫిట్స్ రావడంతో చెరువులో పడి మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

అనారోగ్య సమస్యలతో వివాహిత ఆత్మహత్య

తాడికొండ: అనారోగ్య సమస్యలతో వివాహిత ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడుముక్కల గ్రామానికి చెందిన శెట్టి రాధిక(36) గతకొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, బంధువులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు రావాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పేర్కొన్నారు. గురువారం రైలుపేటలోని నగరపాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఖాసిం విద్యార్థుల హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యార్థులందరు నూరుశాతం మేరకు జగనన్న గోరుముద్ద స్వీకరించేలా అవగాహన కల్పించాలని సూచించారు.

గుంటూరు నగర అదనపు కమిషనర్‌గా లక్ష్మీ శివజ్యోతి

నెహ్రూనగర్ : గుంటూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా కె.లక్ష్మీ శివజ్యోతి నియమితులయ్యారు. గతంలో ఇక్కడ అదనపు కమిషనర్‌గా పనిచేసిన పెద్ది రోజా కృష్ణా జిల్లా డీఆర్‌ఓగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా లక్ష్మీ శివజ్యోతి గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా విధుల్లో జాయిన్ కానున్నారు. గుంటూరు జిల్లా డ్వామా పీడీగా ఎం. వెంకటశివరామిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో నివసించే ఓ మహిళ తన భర్త కనిపించడం లేదంటూ గురువారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా, ఎర్రగుంటపాలెం మండలం, తంగిరాలపల్లె గ్రామానికి చెందిన పిన్నెబోయిన బాలశేఖర్‌కు, నాగలక్ష్మికి వివాహమయ్యింది. వారికి ముగ్గురు సంతానం. మహానాడులోని 3వ లైన్‌లో నివాసముంటూ బతుకుదెరువు కోసం నాగలక్ష్మి ఇళ్లలో పనిచేసుకుంటుండగా, బాలశేఖర్ లాడ్జిలో బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన నాగలక్ష్మిని తన ద్విచక్రవాహనంపై పనిచేసే దగ్గర దించి, లాడ్జికి వెళుతున్నాని చెప్పి తిరిగి రాలేదు. లాడ్జి యజమానులను అడగ్గా పనికి రాలేదని తెలియజేశారు. చుట్టుపక్కల, బంధువుల దగ్గర బాలశేఖర్ గురించి విచారణ చేసినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభించక పోవడంతో నాగలక్ష్మి ఫిర్యాదు చేసిందని, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్ తెలిపారు.

పంట నమోదులో అభ్యంతరాలు తెలపండి

తాడేపల్లిరూరల్: 2023 ఖరీఫ్ సీజన్‌కు గాను పంట నమోదు వివరాలను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేశామని రైతులందరూ తమ పంట నమో దు పొరపాట్లు ఉన్నాయో చూసుకోవాలని గురువారం దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఖరీఫ్ 2023 పంట నమోదుకు సంబంధించి రైతుల జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రారంభించామని, రైతు పేరు, సర్వే నెంబరు, విస్తీర్ణం, పంట నమోదు మొదలగు విషయాలలో ఎక్కడైనా పొర పాట్లు ఉన్నట్లయితే రైతులు ఈనెల 29వ తేదీలోపు సరి చేసుకునేందుకు అవకాశం ఉందని, అభ్యంతరాలను రైతులు రాతపూర్వకంగా వ్యవసాయ సహాయకునికి అందజేయాలని కోరారు. సరిచేసిన జాబితాలను నవంబర్ 1వ తేదీన తిరిగి ఆర్‌బీకేలలో ప్రదర్శించడం జరుగుతుందని ఆమె తెలిపారు. సామాజిక తనిఖీల గురించి అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని ఆమె అన్నారు.

దాక్షాయణి మాతకు విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలోని దాక్షాయణి అమ్మవారికి గురువారం విశేషపూజలు నిర్వహించారు. తొమ్మిదిరోజులుగా నవరాత్రుల పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు విశేష పూజలు చేశారు. ఉదయాన్నే ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దాక్షాయణి అష్టోత్తర, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. చండీపారాయణ, హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను చిట్టా సత్యనారాయణరెడ్డి పర్యవేక్షించారు.

కంద రైతులను ఆదుకోవాలి

తాడేపల్లిరూరల్: కంద పంట వేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో రైతు సంఘం నాయకులతో కలసి ఆయన కంద పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కంద పంటకు తెగులు రావడం వలన తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒక్కో ఎకరానికి గతంలో 100 పుట్ల వరకు దిగుబడి సాధించేదని, ప్రస్తుతం పండు తెగులు రావడంతో 30 పుట్లు కూడా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కంద విత్తనం ఇతర రాష్ట్రాల నుంచి తీసుకుని వచ్చి, పొలంలో నాటి, పెట్టుబడులు పెట్టి, రైతు చేతికి పంట వచ్చేనాటికి మొత్తం ఖర్చు రూ.3 లక్షల వరకు అవుతోందని, కానీ తెగులు వలన కంద దుంప దిగుబడి సాధించక, పొలంలోనే కాండం ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. వ్యవసాయ అధికారులు కందపంటకు సోకిన పండు తెగులు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని, నష్టపోయిన కందపంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు పాల్గొన్నారు.

టీడీపీ సమావేశంలో కుమ్ములాట!

ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్న నాయకులు



టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్‌తో వాదిస్తున్న నసీర్ అహ్మద్

పాత గుంటూరు: గుంటూరు తూర్పు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో నాయకులు, కార్యకర్తల మధ్య సఖ్యత కొరవడి విభేదాలు తార స్థాయికి చేరుకొని కుమ్ములాటకు దారితీస్తున్నాయి. అరండల్ పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ నసీర్ అహ్మద్ అధ్యక్షతన గుంటూరు తూర్పు నియోజకవర్గం సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో తమ పరిధిలోని నాయకులు, కార్యకర్తల నుంచి సమస్యలు, అభిప్రాయాలు, సూచనలను నసీర్ అహ్మద్ అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గానికి చెందిన టీడీపీ బీసీ నాయకుడు వి.ఏడుకొండలు పలు సమస్యలను లేవనెత్తారు. నియోజకవర్గంలో ఓటర్ వెరిఫికేషన్ సక్రమంగా జరగడం లేదని, పరిశీలన కోసం నియమించిన సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన నసీర్ అహ్మద్ చేతిలోని మైక్‌ను ఏడుకొండలుపై విసిరినట్లు, సహ నాయకులు ఏడుకొండలును వేదిక పైనుంచి చొక్కా పట్టి లాగి, నెట్టి పడేసినట్లు కార్యకర్తల నుంచి అందిన సమాచారం. ఈ సంఘటనపై టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ జోక్యం చేసుకొని ఏదైనా సమస్య ఉంటే మాట్లాడుకోవాలి గానీ, పార్టీ సీనియర్ కార్యకర్తలు పలు సమస్యలపై ప్రశ్నిస్తే వాదించడం, దాడులు చేయడం సరైన పద్ధతి కాదని వారించినట్లు తెలిసింది. తూర్పు నియోజకవర్గంలో టీడీపీ చేపట్టే సమావేశాలు ఎప్పుడూ సామరస్యంగా జరగడం లేదని, వాదనలు, ఘర్షణలతోనే ముగుస్తుందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. బీసీ వర్గాలపై దాడులు చేయడంపై ఆ పార్టీ కార్యకర్తల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కాయితి సైదారెడ్డి సేవలు చిరస్మరణీయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



కాయితి సైదారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి

గుంటూరు మెడికల్: ఏబీవీపీ పూర్వ విదర్భ (మహారాష్ట్ర) ప్రాంత సంఘటనా కార్యదర్శి, ఆంధ్రరాష్ట్ర బీజేపీ బిల్డింగ్ కమిటీ చైర్మన్ కాయితి సైదారెడ్డి సంస్మరణ కార్యక్రమం కృష్ణనగర్ మెయిన్‌రోడ్డులోని గోల్డెన్ హోమ్స్‌లో గురువారం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొని సైదారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సైదారెడ్డి మృతి బీజేపీకి తీరని లోటన్నారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసిన నేత సైదారెడ్డి అని కొనియాడారు. రానున్న రోజుల్లో సైదారెడ్డిని సేవలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. పార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, జిల్లా ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, స్వరూపరాణి, పాలపాటి రవికుమార్, భీమినేని చంద్రశేఖర్, కుమార్ గౌడ్, తిరుపతిరావు, సుబ్బారావు, తోట రామకృష్ణ, టీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు కేర్‌వెల్ హాస్పటల్‌లో మెరుగైన వైద్య సేవలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ నాగూర్‌బాషా

గుంటూరు మెడికల్: పేద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగూర్ బాషా వారి మన్ననలు పొందుతున్నారు. గుంటూరువారితోట 7వలైన్‌లోని కేర్‌వెల్ హాస్పటల్‌లో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగూర్‌బాషా మాట్లాడుతూ సుమారు రూ.10వేలు విలువ చేసే ఫైబ్రోస్కాన్ ద్వారా 60 మంది రోగులకు ఉచితంగా నిర్ధారణ పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేర్‌వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ బాష మాట్లాడుతూ కొద్దిరోజుల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేయడం జరుగుతోందన్నారు. పేదల కోసం తక్కువ ఫీజులతో వైద్యసేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 8341713713, 9854757999 సెల్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రాయితీపై శనగ విత్తనాల పంపిణీ



సబ్సిడీపై రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ కిరణ్మయి

కాకుమాను: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎరువులు, విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి కె.కిరణ్మయి అన్నారు. కాకుమాను రైతు భరోసా కేంద్రం–2లో గురువారం రైతులకు 40 శాతం రాయితీపై జె.జి.11 రకం శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలతో పాటు ఎరువులు, విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 13 ఆర్బీకేల్లో శనగ విత్తనాలు 400 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. విత్తనాలు కావల్సిన రైతులు సోమవారం నుంచి ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో సంప్రదించాలని ఏఓ పేర్కొన్నారు.

వీవీఐటీ విద్యార్థుల శ్రమదానం



పరిసరాలు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పెదకాకాని: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా నంబూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, వీవీఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సంయుక్తంగా కళాశాల ప్రాంగణంలో శ్రమదానం, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగుల వినియోగాన్ని తగ్గించాలని, కాలుష్య రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని తరగతి గదుల్లో ప్రచారం చేసి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, చైతన్య గ్రామీణ గోదావరి బ్యాంక్ మేనేజర్ బి.కోటిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ భక్తసింగ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.